# మంగమ్మగారు మహారాజశ్రీ అతిథి

శనివారం ఉదయం నుండే హడావుడి పడడం మొదలు పెట్టింది మంగమ్మగారి రెండో అమ్మాయి.



"బుజ్జీ సెలవురోజున పదింటికి గానీ నిద్ర లేవనిదానివి ఈ రోజు ఏడు గంటలకే లేచి ఈ పనులన్నీ పెట్టుకున్నావేమిటి?" అంటూ ఆశ్చర్యంగా అడిగిందావిడ.

ఆ పిల్లను ఆవిడ బుజ్జి తల్లీ అని చిన్నప్పుడు ముద్దుగా పిలిచేది. అది కాస్తా పొట్టిగా మారి (అమ్మాయి కాదు పేరు!) 'బుజ్జీ' గా మిగిలింది.

"బుజ్జీ' ఏమిటమ్మా 'బజ్జీ' లాగా.. అంటూ కూతురు విసుక్కున్నా ఆవిడ మాత్రం అలాగే పిలుస్తుంది.

హాలు మొత్తం పరచుకుని వున్న తివాచీని వాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేస్తున్న బుజ్జి ఒక క్షణం ఆ క్లీనర్ రాకాసి శబ్దం ఆపి "ఇవాళ మా కొలీగ్‌ని భోజనానికి పిలిచానమ్మా. కార్‌పూల్ లో అతనితోబాటే ఆఫీసుకు వెళ్తుంటాను.." అన్నది బుజ్జి.

ఇద్దరు లేక అంతకన్న ఎక్కువ మంది ఒక కార్లో ప్రయాణంచేస్తే వాళ్ళకి ప్రత్యేకమైన దారిలో వెళ్ళే సదుపాయం వుంది అమెరికాలో ఆరకంగా ఎక్కువ మంది ఒక కార్లో వెళ్ళడాన్ని ప్రోత్సహించడం వలన ఇటు ఇంధనం వాడకం తగ్గుతుందని, అటు రోడ్ల మీద నడిచే కార్లసంఖ్య తగ్గుతుందనిట. మామూలుగా పడవంత కార్లో ఒక్కరే కూర్చుని నడుపుకుంటూ వెళ్ళిపోతుంటారు. అంచేత ఈ కార్‌పూల్ లేన్‌లో ప్రయాణం చేస్తే కాస్త తొందరగా ఆఫీస్‌కు చేరొచ్చునని దూరంనుండీ వచ్చేవాళ్ళు సహోద్యోగిని తమ కార్లో తీసుకెళ్ళడం మరి కొన్నాళ్ళు వాళ్ళ కార్లో తాము వెళ్ళడం చేస్తుంటారట. ఇవన్నీ మంగమ్మ గారికి బుజ్జి విశదీకరించి చెప్పింది.

అయితే బుజ్జి వాళ్ళు అమెరికాకు వచ్చి రెండేళ్ళయినా బుజ్జి ఈ మధ్యనే ఉద్యోగంలో చేరింది. అంచేత తనకోసం ఇంకా కారు కొనుక్కోలేదు. కొన్నాళ్ళు బుజ్జి భర్త కాస్త తొందరగా బయల్దేరి బుజ్జిని మిల్పిటాస్ లో వున్న వాళ్ళ ఆఫీస్ దగ్గర దింపి తను మరో వైపున వున్న 'సాంటాక్లారా' లో ఆఫీస్‌కి వెళ్ళేవాడు. అలా వెళ్ళడం శ్రమ ఎక్కువే కాక సమయం, గ్యాస్ కూడా వృధా అవుతొందని కారు కొనాలని చూడ్డం మొదలు పెట్టారు. ఒక కారు కొత్తది కొన్నారు గనుక రెండోది యూజ్‌డ్ కార్ కొంటే సరిపోతుందను కుంటున్నారు... ఉద్యోగంలో చేరిన నాలుగురోజుల్లోనే బుజ్జికి పరిచయమైన సహోద్యోగి మాటల్లో తనూ ఫ్రీమాంట్ నుండే వస్తున్నానని చెప్పాట్ట. అతను వుండేది కూడా బుజ్జి వాళ్ళుంటున్న పార్క్ వుడ్ ప్లేస్ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌కి దగ్గరే వున్న 'పార్క్ వ్యూ' లోనట. కొత్తలో కొన్నాళ్ళు రోజూ అతని కార్లోనే వెళ్ళేది బుజ్జి. తను కారు కొనుక్కున్నాక కూడా తన కార్లో కొన్నాళ్ళు అతని కార్లో కొన్నాళ్ళు లాగా కలిసి వెళ్తున్నారు.

"అమెరికన్ కుఱ్ఱాడికి నువ్వేం వండి పెడతావే? వాళ్ళకు పిజ్జాలు, బర్గర్‌లు, డోనట్స్ కావాలేమో..." అంటూ సందేహం వ్యక్తం చేశారు మంగమ్మగారు.

"అమ్మా... అతను మన భారతీయుడే... పైగా తెలుగువాడు కూడా... కాబట్టి నువ్వేమో మసాలా వడలు చెయ్యి. నేను మిరపకాయబజ్జీలు వేస్తాను. చక్ర పొంగలి కూడా చేద్దాం" అంది బుజ్జి స్టౌ కింద వున్న ఓవెన్‌లో పెట్టిన పెరుగు (చలికి పెరుగు తోడుకోవడం కష్టమని వెచ్చగా వుంటుందని హాట్ ప్లేట్ క్రింద అమర్చి వున్న ఓవెన్‌లో పెడుతుంది) తోడు కుందో లేదో నని గిన్నె కదిపి చూస్తూ.

"అయితే నేను తొందరగా తొట్టిలోకి దిగుతాను" అంటూ స్నానాల గదిలోకి వెళ్ళిందావిడ. చిన్నప్పుడు (మంగమ్మ గారి చిన్నప్పుడు) ఒళ్ళు రుద్దుకోకుండా నాలుగు చెంబులు నీళ్ళు ఒంటిమీద దిమ్మరించుకుని వస్తే తొట్టి స్నాన మయిందా అనేది వాళ్ళమ్మ... ఇప్పుడు అమెరికాకు వచ్చాక రోజూ తొట్టిస్నానం చేస్తున్నదావిడ. బాత్ రూములో ఇంతపొడవున స్నానాల తొట్టి , దానికి అటు ఇటు జరిపే గాజు తలుపులు, మిగతా సగంగదిలో కమ్మోడ్, వాష్ బేసిన్ అద్దం వంటివి వుండటం అక్కడ పద్ధతి. ఆ తొట్టిలో తప్ప నీటి చుక్క క్రిందపడకుండా మిగతా సగం బాత్ రూములో నేల కనబడకుండా కాలిరగ్గులు పరచి వుంటాయి. ఈ పద్ధతి ఆవిడకస్సలు నచ్చలేదు. 'నీళ్ళగదిలో నీళ్ళ చుక్క క్రింద పడకూడదంటే ఎలాగ వీళ్ళ మొహం' అంటూ విసుక్కుంటుంది.

అమ్మా కూతురు కలసి పదకొండున్నర కల్లా వంట ముగించారు. చేసిన పదార్థాలన్నీ గాజు గిన్నెలలోకి సర్ది డైనింగ్ టేబులు మీద పెడుతుంది బుజ్జి.

"బుజ్జీ నేనలా ఎదురుగా వున్న పార్కులో వెళ్ళి నాలుగడుగులు నడిచి వస్తానే" అంటూ బయల్దేరారు మంగమ్మగారు. అప్పటికి డిసెంబరు నెల చలి కాస్త తగ్గి ఎండ పొడ కనబడుతోంది.

"మీరూ వస్తారా వాకింగ్‌కి" అంటూ భర్తను అడిగిందావిడ "నేను సాయంత్రం వెడతాలే...నువ్వెళ్ళు... మీ తెలుగు క్లబ్ మెంబర్లు నీకోసం చూస్తుంటారు." నవ్వుతూ అన్నారు మంగపతిగారు.

ఆయనగార్ని రమ్మని పిలవడంలో మంగమ్మగారి స్వార్థం కాస్త వుంది. అయిదో అంతస్తు నుండి ఎలివేటర్లో క్రిందికి వెళ్ళి , అక్కడ లాంజ్ నుండి

ముందు గదిలోకి ఆపైన బయటకు వెళ్ళాలి. ఎలివేటర్లో ఎన్నిసార్లు తిరిగినా ఒంటరిగా వెళ్ళడం ఇప్పటికీ ఆవిడకు కాస్త భయమే. అలాగే లాంజ్‌లో నుండీ ముందు గది నుండీ తలుపులు తీసుకుని వెళ్ళడం లోపలి నుండి బయటకు వెళ్ళేటప్పుడు సులువే గానీ మళ్ళీ బయట నుండి లోపలకి రావాలంటే తాళం తీసుకుని రావాలి. అమెరికా వాళ్ళు తాళం వేయడం, స్విచ్‌లు వేయడం అన్నీ ఉల్టా పద్ధతి గనుక ఆవిడకు ఆ తాళాలు తీయడం అంత త్వరగా రాదు.

సరే ఆయన రానన్నారు గనుక తాళాలు తీసుకుని బయల్దేరిందావిడ.

"అమ్మా! అతను పన్నెండున్నర కల్లా వస్తానన్నాడు. ఆలస్యం చేయకుండా వచ్చేయి. కబుర్లలో పడి మరచిపోకు" అంటూ హెచ్చరించింది బుజ్జి. మంగపతిగారు బుజ్జి వంక అర్ధయుక్తంగా చూసి చిరునవ్వు చిలకరించారు. వాళ్ళిద్దరికీ తెలుసు మంగమ్మగారు పార్కులోకి వెళ్ళేది వాకింగ్ కోసం కన్న అక్కడ చేరే అత్తగార్లు కోడళ్ళ గురించి చాడీలు చెప్పుకోవడం, కోడళ్ళు ఇండియాలోని అత్తమామలకు మరుదులకు డబ్బు పంపించలేక పడే అవస్థల కబుర్లూ వినడానికేనని.

మంగమ్మగారు పార్కుకి వెళ్ళి నాలుగడుగులు నడిచి, పదికబుర్లు విని" ఇక నేను వెళ్తానమ్మా... వేళకు భోజనం చేయకపోతే నీకు అసలే గాస్ట్రిక్ ట్రబుల్ వుంది... ఎక్కువై అవస్థపడతావని మా బుజ్జి కోప్పడుతుంది" అంటూ ఇంటికి బయల్దేరింది.

"అదృష్టవంతురాలివమ్మా! కూతురు కాబట్టి మీ ఆరోగ్యం గురించి అంత శ్రద్ధచూపిస్తుంది. అదే నేను గనుక సాయంత్రం దాకా అన్నం తినక పోయినా ఎందుకు తినలేదని అడగదు మా కోడలు" అంది పక్క కాంప్లెక్స్‌లో వుండే ఒక తెలుగత్తగారు.

ఆ కోడలి స్నేహితురాలు తన పాపాయిని స్ట్రోలర్‌లో అలా తిప్పడానికి వచ్చి ఈ మాటలు వినగానే "మీ బుజ్జి అదృష్టవంతురాలు ఆంటీ! సాయంత్రం తను ఇంటికి వచ్చేసరికి రోజు కొక రకం టిఫిన్ వేడిగా చేసివుంచుతార్ట. సాయంత్రం ఏడింటికి నేను ఆఫీసు నుండి వచ్చినా మా అత్తయ్య అయితే 'టీ' కూడా పెట్టుకొని త్రాగరు. నేను రాగానే 'టీ' పెట్టి ఇవ్వమ్మా నాకూ మీ మామయ్యకు అంటారు. అంటూ అత్తగారు ఇండియాకు వెళ్ళిపోయిందన్న ధైర్యంతో చెప్పుకుంది.

మంగమ్మగారు రోడ్డు దాటి తాము వుంటున్న అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ లోపలికి వస్తుండగానే ఆవిడ వెనుకనే మరొక అతను లోపలికి వచ్చాడు.

గేటు లోపలికి వచ్చాక కూడా చాల దూరం నడవాలి లాంజ్ చేరడానికి. అతనూ తన కూడ వస్తుంటే పక్కకు తిరిగి పరిశీలనగా అతని ముఖంలోకి చూసిందావిడ.

ఎక్కడో చూసినట్టు, పరిచితమైన ముఖంలా కనబడింది. ఆవిడ అలా చూస్తుండగా అతను కూడా మంగమ్మగారి ముఖంలోకి పరీక్షగా చూశాడు.

మంగమ్మగారి ముఖంలో ఒక జ్ఞాపకం తాలూకు మెరుపు తళుక్కుమంది.

"మిమ్మల్ని ఎక్కడో చూశాను. ఆ.. లేక్ టాహో సిటీలో తాజ్‌మహల్ హోటల్లో చూశాను! ఇంకా అక్కడే పనిచేస్తున్నారా వేరే ఉద్యోగం దొరికిందా?" కాస్త జాలిగా అడిగిందావిడ. క్రిందటి ఏడాది ఆవిడ అమెరికాకు వచ్చినప్పుడు మంగమ్మగారి అమ్మాయి ఆవిడను లేక్ టాహో సిటీకి తీసుకెళ్ళినపుడు వాళ్ళు 'రినో' లో మోటెల్ లో దిగారు. రోజుకు యాభై డాలర్లు అద్దె అని విని అమ్మో రెండున్నర వేలా? అన్నదావిడ "తక్కువే కదమ్మా" అంది బుజ్జి. ఆరోజు రాత్రి అక్కడ దగ్గర్లో వున్న "సర్కస్ సర్కస్" అనే కాసినోకు వెళ్ళారు. ఎక్కడ చూసినా స్లాట్ మెషిన్స్ దగ్గర కూర్చుని డబ్బులు పెట్టి ఆడుతున్న జనం కనిపించారు.

స్టేజి మీద ఒక తెల్లపిల్ల నడుముకు, కాళ్ళకు, చేతులకు పెద్ద రింగులు, తగిలించుకుని అవి క్రింద పడకుండా కాళ్ళు, చేతులు, నడుము ఊపుతూ డాన్స్ చేస్తోంది. తను చిన్నప్పుడు చూసిన 'త్రీరింగ్ సర్కస్' గుర్తొచ్చిందావిడకు.

మరుసటిరోజు సౌత్ లేక్ టాహోసిటీ స్కీ ఏరియాకు వెళ్ళారు. అక్కడ పదివేల మైళ్ళ ఎత్తున కొండమీదకి గండోలా రైడ్‌లో వెళ్ళారు. అక్కడి నుండి క్రింద కనబడే లేక్ చూస్తుంటే అద్భుతంగా అనిపించింది. దిగి వచ్చాక ఇండియన్ హోటల్ కోసం వెతుకుతూ వెళ్ళి తాజమహల్ హోటల్‌కి వెళ్ళారు. రెస్టారెంట్ అని బుజ్జి అంటుందిగానీ ఆవిడ మాత్రం హోటల్ అనే అంటుంది.

ఎవరికి వాళ్ళు వెళ్ళి ప్లేట్‌లో వడ్డించుకుని తెచ్చుకున్నారు.

"అమ్మా మసాల వడలు బాగున్నాయి చూడు" అంది బుజ్జి.

తన ప్లేటు తీసుకుని మసాల వడలు వడ్డించుకోవడానకి వెళ్ళిందావిడ. అవి ఎక్కడున్నాయా అని అటూ ఇటూ చూస్తుంటే అదిగో అప్పుడు తటస్థ పడ్డాడీ అబ్బాయి.

'ఏం కావాలండీ? అని ఇంగ్లీషులో అడిగి, ఎక్కడ వున్నాయో చూపించాడు.

'థాంక్స్' అని చెప్పి నాలుగు వడలు వేసుకుని "ఇండియన్స్ లైక్ మసాల వడల్స్ "అన్నదావిడ" అతను నవ్వేశాడు. తర్వాత అతనే చెక్ తెచ్చిచ్చాడు.

బుజ్జీ వాళ్ళు చెక్ పే చేయడానికి వెళ్ళినప్పుడు మంగమ్మగారు "యు స్పీక్ ఇంగ్లీష్ ఓన్లీ?" అనడిగింది ఆ యువకుడిని.

"నేను తెలుగు వాడినే అమ్మా" అన్నాడతను.

అందుకే అతను గుర్తుండి పోయాడు మంగమ్మ గారికి ఏణ్ణర్థం తరువాత కనబడినా గుర్తు పట్టిందావిడ.

ఆ యువకుడు ఇబ్బందిగా కదిలి "ఎమ్.ఎస్ అయిపోయాక 'సిస్కో'లో చేరానండీ. ఈ సిటీకి దగ్గర్లోనే మా ఆఫీసు" అన్నాడు.

"మా బుజ్జికూడా సిస్కోలోనే పని చేస్తోంది. ఇవాళ ఎవరో కొలీగ్‌ని భోజనానికి పిలిచింది. అందుకని మసాల వడలు చేశాను... మా ఇంటికి వచ్చి నేను చేసిన వడలు రుచి చూసి వెళ్ళండి" అంటూ ఆహ్వానించిందావిడ." నేను చేసినంతరుచిగా ఏ హోటల్లో చేయరు" అని కూడా చెప్పింది మళ్ళీ ఆవిడే.

నేను వెళ్ళాలండీ! తెలిసిన వాళ్ళు పిలిచారు" అన్నాడతను ముందుకు కదులుతూ. గబగబ నడిచి వెళ్ళిపోయాడు.

మంగమ్మగారు నెమ్మదిగా నడుస్తూ లాంజ్ దగ్గరికి వచ్చేసరికి ఆ యవకుడు కనబడలేదు.

తంటాలు పడి తాళం తీసుకుని ఎలివేటర్‌లో పైకి వచ్చి ఇంటికి చేరిందావిడ.

ఆవిడ లోపలికి వచ్చేసరికి ఇందాక కనబడిన అతను హాల్లో కూర్చుని అల్లుడితో కబుర్లు చెబుతూ కనబడ్డాడు. బుజ్జికూడా మధ్యలో మాట్లాడుతోంది. మంగమ్మగారు ఆశ్చర్యపోయారు.

"మీరిద్దరూ ఈయనగార్ని గుర్తు పట్టేశారా?" అన్నదావిడ బుజ్జివైపు ఆశ్చర్యంగా చూస్తూ.

బుజ్జిముఖం రంగులు మారింది. తల్లి వాక్ప్రవాహాన్ని అడ్డుకుంటూ" అమ్మా! ఈయన మా టీమ్ మేనేజరు వివేక్ గారు.. అంటే మాప్రాజెక్ట్ లీడరన్న మాట" అంది. అతన్ని మనం లేక్ టాహో లో తాజ్‌మహల్ హోటల్లో చూశాం గుర్తు లేదేమిటే? ఇందాకా కనబడితే మనింటికి రమ్మని పిలిచాను" అన్నారు మంగమ్మగారు, నా జ్ఞాపకశక్తినే శంకిస్తారా? అన్న హర్ట్‌టోన్‌లో అమ్మా... అంటూ బుజ్జి ఏదో చెప్పబోతుంటే "పరవాలేదు లెండి" అంటూ ఆపేశాడు వివేక్

"పిన్నిగారూ! ఎమ్.ఎస్ పరీక్షలు రాశాక కొన్నాళ్ళు ఖాళీగా వున్నాను. అప్పుడు నన్ను ఆ హోటల్లో చూశారు మీరు. ఇప్పుడు 'సిస్కో' లో మీ అమ్మాయి కొలీగ్‌ని. ఈ రోజు మీ అమ్మాయి అదే 'బుజ్జి' భోజనానికి పిలిచింది నన్నే... మీరు చేసిన మసాలా వడలు తినే ప్రాప్తముందన్న మాట నాకు!" అంటూ నవ్వేశాడు వివేక్.

"అత్తయ్యా! అమెరికాలో ఇవన్నీ మామూలే" నేను ఎమ్.ఎస్ చదివేటప్పుడు మాస్కూల్ (యూనివర్శిటీ) కాంపస్ క్యాంటీన్‌లో కొన్నాళ్ళు పాకెట్‌మనీ కోసం పనిచేశాను తెలుసాండీ?" అన్నాడు మంగమ్మగారి అల్లుడు.

"అమ్మా ఇక్కడ కోటీశ్వరుల పిల్లలైనా పేపర్లు పంచడం నామోషీ అనుకోరు. ఏపనైనా 'డూ ఇట్ యువర్ సెల్ఫ్' అన్నది ఇక్కడి పద్ధతి. చూశావుగా కంప్యూటర్ టేబులు మీ అల్లుడే బిగించారు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ అనేది ఇక్కడికి వచ్చాక మనవాళ్ళూ నేర్చుకుంటారు" అంది బుజ్జి.

"అయితే మా బుజ్జి భోజనానికి పిలిచిన మహారాజశ్రీ అతిథి మీరే నన్నమాట" అంటూ తనూ ఆ నవ్వులో జత కలిపారు మంగమ్మ గారు.

"నీవు చేసే మసాల వడల కీర్తి కర్నూలు హౌసింగ్ బోర్డులో వుండే నీ స్నేహితులకే కాక కాలిఫోర్నియాకు కూడా పాకిందన్న మాట!" అంటూ భార్యవైపు మెప్పుకోలుగా చూసి నవ్వేశారు మంగపతిగారు.

***